WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguj yothidaily.com

PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

జాతీయ దిన పత్రిక

అనుక్షణం జనం కోసం



విలేఖర్లు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు
నియోజకవర్గాలు మండలాల వారీగా
"తెలుగుజ్యోతి" జాతీయ దినపత్రిక కు
రిపోర్టర్లు కావలెను
ఎటువంటి యాడ్ టార్గెట్లు లేవు,
క్యాలెండర్ టార్గెట్లు లేవు,

9700959506

www.telugujyothinews. com




PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA

సంపుటి:01 సంచిక:187 ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ పేజీలు:04 తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ సోమవారం 01-12-2025 వెల రూ.4.00


## తెలంగాణ పంచాయతీ ఎన్నికలు

తొలి విడతకు వెల్లువెత్తిన నామినేషన్లు

- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 25 వేలకు పైగా నామినేషన్లు దాఖలు
- 4,236 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ
- డిసెంబర్ 11న తొలి దశ పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- మొత్తం మూడు విడతల్లో 12,728 పంచాయతీలకు ఎన్నికలు
- కేంద్ర నిధుల కోసమే ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ



## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

### రేవంత్ సర్కారుపై హరీశ్ ఫైర్

- కాంగ్రెస్, బీజేపీలు తోడు దొంగలంటూ హరీశ్ రావు విమర్శ
- గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అంటూ ఎద్దేవా
- స్థానిక ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను నిలదీయాలని పిలుపు



మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలూ తోడు దొంగలని, వారి

# భవిష్యత్ కోసం



- డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు
- అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే లక్ష్యం
- విజన్ డాక్యుమెంట్‌లో రెండు ప్రధాన అంశాలు
- హైదరాబాద్ లోపలి ఏరియాలో వివిధ విభాగాల పాలన ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# పారదర్శక పాలసీలు

## నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ...

### 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో 37 మంది మావోయిస్టులు లొంగుబాటు
- వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు
- ప్రభుత్వ 'పూనా మర్గం' పునరావాస విధానంతోనే మార్పు
- లొంగిపోయిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు
- గ్రామస్తుల మద్దతు కరువవడంతోనే లొంగుబాటని వెల్లడి



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు.

## భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల

### 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం

- మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు
- అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం
- చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని
- డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన భారత క్రీడాకారులు
- విజేతల ధైర్యం, పట్టుదల దేశానికే స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా



## జాగృతి జనంబాట యాత్రపై కవిత మరో కీలక నిర్ణయం

ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేత



## యూకేలో భారత విద్యార్థి హత్య

- కత్తులతో దాడి చేసిన దుండగులు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన హర్యానా యువకుడు
- ఐదుగురు అనుమానితులను అరెస్టు చేసిన యూకే పోలీసులు



## రష్యా ఆయిల్ ట్యాంకర్‌పై దాడి మా పనే

### : ఉక్రెయిన్ ప్రకటన

- నల్ల సముద్రంలో రష్యా ఆయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి
- దాడికి బాధ్యత తమదేనని ప్రకటించిన ఉక్రెయిన్
- రష్యా 'షాడో ఫ్లీట్'ను లక్ష్యంగా చేసుకున్న ఉక్రెయిన్ దళాలు
- 'సీ బేబీ' అనే ఆధునిక డ్రోన్లతో దాడి చేసినట్లు వెల్లడి
- రష్యా చమురు రవాణాకు భారీ దెబ్బ!



నల్ల సముద్రంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. రష్యాకు చెందిన 'విరాట్' అనే ఆయిల్ ట్యాంకర్‌పై శనివారం మానవ రహిత సముద్ర వాహనం

## రాహుల్ గాంధీకి కేటీఆర్ సంచలన లేఖ


హైదరాబాద్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ ను స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటని ఆరోపణలు చేశారు. అత్యంత అవినీతితో కూడుకున్న



## 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

### సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు

- 'ఐబొమ్మ' రవిని కాదు, సినిమా మాఫియాను ఉరితీయాలన్న నారాయణ
- వందల రూపాయల టికెట్ ధరల వల్లే ఇలాంటివి పుట్టుకొస్తున్నాయని వెల్లడి
- వ్యవస్థలోని లోపాలే రవి లాంటి వారిని తయారుచేస్తున్నాయని వ్యాఖ్యలుస
- ఒక హిడ్మాను చంపితే వెయ్యి మంది పుడతారన్న నారాయణ



## చేతల ప్రభుత్వం బీఆర్ఎస్.. చెత్త ప్రభుత్వం కాంగ్రెస్

సంగారెడ్డి జిల్లా బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను పక్కనబెడితే ఊరుకోం.. పనులు వెంటనే మొదలుపెట్టకపోతే రైతుల పక్షాన పాదయాత్ర చేపడుతామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించకపోతే రైతుబంధు పథకం పూర్తిగా బంద్ కావడం ఖాయమని అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ..



ALL ARE CONTINUE 2 PAGE

# గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

మొదటి పేజీ తరువాయి

మధ్య 'గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ' నడుస్తోందని ఆయన ఆరోపించారు. కల్వకుర్తికి చెందిన పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హైదరాబాద్?లో ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హరీశ్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు బాకీ పడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను 'మా బాకీ పైసలు ఎప్పుడు ఇస్తారు?' అని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ, తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తేలేకపోయారని విమర్శించారు. పక్క రాష్ట్రాలకు కేంద్రం వేల కోట్లు కేటాయిస్తుంటే, తెలంగాణకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కళకళలాడిన హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల వెలవెలబోతున్నాయని, రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేశారని దుయ్యబట్టారు.గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆయన కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# రష్యా ఆయిల్ ట్యాంకర్‌పై దాడి మా పనే

మొదటి పేజీ తరువాయి

(అన్‌మ్యాన్డ్ సీ వెహికల్) దాడి చేసింది. శుక్రవారం రాత్రి కూడా ఇదే ట్యాంకర్‌పై దాడి జరగ్గా, ఇది రెండో ఘటన. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది.ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్‌బీయూ), నౌకాదళం సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఏఎఫ్?పీ కథనం వెల్లడించింది. తమపై డ్రోన్ దాడి జరిగిందని, సహాయం కావాలని ట్యాంకర్ సిబ్బంది రేడియో ద్వారా అత్యవసర సందేశం పంపారు. ఆధునిక 'సీ బేబీ' నావల్ డ్రోన్లతో ఈ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నామని, దాడికి సంబంధించిన వీడియో ఫుటేజీని కూడా ఉక్రెయిన్ వర్గాలు విడుదల చేశాయి.గాంబియా జెండాతో ప్రయాణిస్తున్న ఈ ట్యాంకర్లు, రష్యా 'షాడో ఫ్లీట్'లో భాగంగా పనిచేస్తున్నాయని తెలుస్తోంది. పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఉల్లంఘించి ఈ ట్యాంకర్లు రష్యా నుంచి చమురును రవాణా చేస్తున్నాయి. ఈ షాడో ఫ్లీట్ ద్వారా వచ్చే ఆదాయంతోనే రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటోందని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. ఈ దాడులతో రష్యా చమురు రవాణాకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఉక్రెయిన్ అధికారి ఒకరు తెలిపారు. దాడికి గురైన నౌకల్లో సుమారు 70 మిలియన్ డాలర్ల విలువైన చమురు ఉండవచ్చని 'ది కీవ్ ఇండిపెండెంట్' పేర్కొంది. ఈ దాడిలో 'విరాట్' ట్యాంకర్‌కు స్వల్ప నష్టం జరిగినప్పటికీ, ప్రస్తుతం దాని పరిస్థితి స్థిరంగానే ఉందని, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని టర్కీ రవాణా మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# భవిష్యత్ కోసం పారదర్శక పాలసీలు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్లపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ కోసం పారదర్శక పాలసీలు తెస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ల గురించి వివరించారు. విజన్ డాక్యుమెంట్‌లో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఒకటి విజన్, రెండోది స్ట్రాటజీ ఉన్నాయని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే లక్ష్యమని వ్యాఖ్యానించారు హైదరాబాద్ లోపలి ఏరియాలో వివిధ విభాగాల పాలన ఉందని తెలిపారు. అందుకే ఈ ప్రాంతం మొత్తాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించామని చెప్పుకొచ్చారు. కాలుష్య రహితంగా హైదరాబాద్‌ను మార్చాల్సి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ...

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు నామినేషన్ల పర్వం ముగిసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం.అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రికి ప్రకటించే అవకాశం ఉంది. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ.షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు.15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి మురిగిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

### భారత క్రీడారంగానికి

# ఇది 'సూపర్ హిట్' నెల

మొదటి పేజీ తరువాయి

పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు.అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ-ఫైనల్‌లో ఇరాన్‌పై 33%-%21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35%-%28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు.ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి.అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు."మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

# 'ఐబొమ్మ' వెబ్‌సైట్‌లో నేను కూడా సినిమాలు చూశాను

మొదటి పేజీ తరువాయి

సీపీఐ అగ్రనేత కె.నారాయణ 'ఐబొమ్మ' వెబ్‌సైట్ వ్యవహారంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మ రవిని శిక్షించడం కంటే అసలైన సినిమా మాఫియాను ఉరితీయాలని, అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు. తాను కూడా ఐబొమ్మలో ఉచితంగా సినిమాలు చూశానని ఈ సందర్భంగా నారాయణ వెల్లడించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.టికెట్ ధరలను రూ.600-700కు పెంచితే సామాన్యులు సినిమాలు ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. "కోట్లు ఖర్చుపెట్టి, టికెట్ ధరల కోసం అడుక్కుంటారు. సామాన్య ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందా? కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వారిని ఐబొమ్మ రవి దెబ్బకొట్టారు" అని నారాయణ వ్యాఖ్యానించారు. ఒకరిని జైల్లో వేయడం వల్ల ప్రయోజనం లేదని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాలని సూచించారు.వ్యవస్థలోని లోపాలను సరిచేయనంత కాలం ఇలాంటి వ్యక్తులు పుట్టుకొస్తూనే ఉంటారని నారాయణ హెచ్చరించారు. "ఒక ఐబొమ్మ రవిని జైలులో వేస్తే మరో వంద మంది వస్తారు. అదే విధంగా, మావోయిస్టు నేత హిడ్మాను చంపడం ద్వారా వెయ్యి మంది హిడ్మాలు పుడతారు" అని అన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లే రవి లాంటి వారు తప్పుడు మార్గంలోకి వెళుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు.వ్యక్తులను శిక్షించడం సమస్యకు పరిష్కారం కాదని, అసలు సమస్య వ్యవస్థలోనే ఉందని నారాయణ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థే ఐబొమ్మ రవి లాంటి వ్యక్తులను సృష్టిస్తోందని, లోపాలను సరిదిద్దకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి వారు వస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీకి కేటీఆర్ సంచలన లేఖ

మొదటి పేజీ తరువాయి

ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగిస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌కు తెలుసా.. లేకపోతే కావాలని మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఈ అవినీతి కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందని అన్నారు. దీనివల్ల తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు.హైదరాబాద్ నగరంలోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని గుర్తుచేశారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాయితీ ధరలకు ఇచ్చారని పేర్కొన్నారు కేటీఆర్.

# యూకేలో భారత విద్యార్థి హత్య

మొదటి పేజీ తరువాయి

ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లిన హర్యానా యువకుడు అక్కడ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ నెల 25న దుండగులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబం, యూకే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగి. ఉన్నత చదువుల కోసం ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది ప్రారంభంలో యూకే వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 25న వోర్ స్టర్ లో విజయ్ పై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన విజయ్ ను పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ విజయ్ తుదిశ్వాస విడిచాడు.విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన యూకే పోలీసులు.. విజయ్ పై దాడి చేసిన దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. విజయ్ హత్యకు గురయ్యాడని తెలిసి ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. విజయ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకురావడానికి సహాయం చేయాలని విదేశాంగ శాఖకు, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీలకు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# జాగృతి జనంబాట యాత్రపై కవిత మరో కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'జాగృతి జనంబాట యాత్ర'పై మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 4వ తేదీ నుంచి జనంబాట కొనసాగించాలని నిర్ణయించారు. అక్టోబరు 25వ తేదీన నిజామాబాద్‌లో కవిత జనంబాట యాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే.మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి, వనపర్తి, కామారెడ్డి జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామీణ జిల్లాల్లో యాత్రను నిలిపివేశారు కవిత.గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ లేని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో డిసెంబరు నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు యాత్ర నిర్వహించాలని భావించారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి కార్యాలయం సవరించిన షెడ్యూల్‌ను ఆదివారం ప్రకటించింది. హైదరాబాద్ జిల్లాలో డిసెంబర్ 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు యాత్ర చేపట్టనున్నారు కవిత.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18,19 తేదీల్లో, గద్వాల జిల్లాలో 21, 22 తేదీల్లో యాత్ర నిర్వహించనున్నారు. యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, సూర్యాపేట, సిరిసిల్ల, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, ములుగు, జగిత్యాల, మహబూబాబాద్, నిర్మల్, నారాయణపేట, సిద్ధిపేట, మంచిర్యాల జిల్లాలో ఫిబ్రవరి మూడో వారం వరకు యాత్ర కొనసాగించనున్నారు కవిత.

# చేతల ప్రభుత్వం బీఆర్ఎస్.. చెత్త ప్రభుత్వం కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. ఈ రోజు నారాయణఖేడ్ నియోజకవర్గం వెళ్తే రెండు లారీల సోయాబీన్ కొంటే అందులో 60 క్వింటాళ్లను వాపస్ పంపించారు. నారాయణఖేడ్‌లో అయినా రాష్ట్రంలో అయినా మక్కలు, సోయాబీన్ పంట కొని నెల రోజులు అయిపోయింది. మక్క, సోయాబీన్ కు ఇప్పటిదాకా ప్రభుత్వం ఒక రూపాయి విడుదల చేయలేదు.పంట కొనుగోలు చేసిన 48 గంటల్లో చెల్లింపులు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్నాడు. 48 రోజులు అయిపోయినా ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక రూపాయి కూడా రైతులకు చెల్లించలేదు. వ్యవసాయ శాఖ మంత్రి చావు కబురు చల్లగా చెప్పిండు ..

ముల్లకర్ర పట్టి పొడిచినా ఈ ప్రభుత్వానికి చలనం లేదని చురకలంటించారు. రాష్ట్రంలో సోయాబీన్ రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కొనుగోలు చేయడం లేదు. కొన్న పంటను కూడా వాపస్ పంపిస్తున్నారు. వెంటనే మక్క, సోయాబీన్ పంట కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు జరపాలని డిమాండ్ చేస్తున్నాం. రెండుసార్లు రైతుబంధు ఇచ్చి రెండుసార్లు ఎగ కొట్టారు. పోయిన యాసంగి బోనస్ ఇంకా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రూ.1150 కోట్లను యాసంగి బోనస్ కింద సన్న వడ్లకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. సాగు చేసిన భూమికే రైతుబంధు ఇస్తామని చావు కబురు చల్లగా చెప్పిండు వ్యవసాయ శాఖ మంత్రి.

మూడు పంటలకు రైతుబంధు ఇయ్యాలని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు సాగుచేసిన భూమికే రైతు బంధు ఇస్తా అంటున్నాడు.55 లక్షల ఎకరాల్లో పత్తి పంట పండుతుంది. 8 నెలలకు ఒకసారి పంట వస్తుంది. అంటే పత్తి రైతుకు సంవత్సరానికి ఒకసారి రైతుబంధు ఇస్తావా..?చెరుకు అనేది 11 నెలల పంట. చెరుకుకి ఒక్కసారే రైతుబంధు ఇస్తా అని ప్రభుత్వం అంటున్నది.పంట తోటలకు ఒక పంటకే ఇస్తావా? 7 లక్షల ఎకరాల్లో కందుల సాగు జరుగుతుంది.పసుపు, పత్తి, ఆయిల్ పామ్, పండ్ల తోటలకు ఒక సారి మాత్రమే రైతుబంధు ఇస్తానని ప్రభుత్వం చెబుతున్నది.రైతుబంధు ఎగ్గొట్టే కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఉన్నాడు. ఇప్పటికే బోనస్ ఎగ్గొట్టిండు. పంటల బీమా ఎగగొట్టిండు.ఈ యాసంగిలో సాగు చేసిన వారికే రైతు బంధు అని ప్రభుత్వం చెపుతుంది.

కాంగ్రెస్ ని ఓడగొడితేనే..

సర్పంచ్ ఎలక్షన్లలో కాంగ్రెస్ ని ఓడగొడితేనే రెండు పంటలకు రైతుబంధు వస్తుంది. 11 సార్లు రైతు బంధు ఇచ్చింది కేసీఆర్. కరోనా కష్టకాలంలో కూడా రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. 70 లక్షల ఎకరాలకు రైతుబంధు ఒకటే సారి ఇస్తామని ప్రభుత్వం అంటున్నది.కేవలం వరికి మాత్రమే రైతుబంధు ఇస్తారా..? యాసంగిలో కోటి 46 లక్షల మందికి ఇస్తావా? లేదా సగం మందికి ఎగ్గొడతావా..? రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక విధానం లేదా..? కేసీఆర్ దేశంలో మొట్టమొదటిసారి రైతుబంధు పథకాన్ని తెచ్చాడు. రైతులందరికీ రైతుబంధు సంవత్సరానికి రెండుసార్లు ఇచ్చాడు.కాంగ్రెస్ పార్టీని సర్పంచ్ ఎన్నికల్లో ఓడగొట్టాలి.. లేకపోతే రైతుబంధు పోతుంది. దేశంలో పత్తి దిగుబడి చాలా తగ్గిపోయింది పత్తి రైతులను ఆదుకోవాలి.యాసంగికి పత్తి రైతులకు రైతుబంధు ఎగ్గొట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు.

## గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

### అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జెరిపోతుల నరేష్...



**తెలుగుజ్యోతి న్యూస్, బచ్చన్నపేట నవంబర్ 30:** రాజకీయఅనుభవం ఉన్న యువకుడు అను నిత్యం గ్రామప్రజల సమస్యలకు తోడ్పడుతూ గ్రామ ప్రజల అభివృద్ధిని కోరుకుంటూ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న యువకుడు జెరిపోతుల నరేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోనే ప్రజలకు ఆనాటి నుండి ఇప్పటివరకు అందుబాటులో ఉండి, గత గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసి పరాజయం పొందడం జరిగిందని, గ్రామ ప్రజలు ఇప్పుడు ఆశీర్వదిస్తే జరగబోయే స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజాసేవ చేసే అవకాశం దక్కుతుందని, గ్రామ అభివృద్ధి కోసం పని చేయాలనే సంకల్పాన్ని తన కోరికను తెలిపారు

## ఆటో యూనియన్ సభ్యులు ఎలమ్మ తల్లికి ప్రత్యక పూజలు




**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి నవంబర్ 30:** శేరిలింగంపల్లి నియోజకవర్గం బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మరియు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఆటో యూనియన్ సభ్యులతో కలిసి ఎల్లమ్మ తల్లికి ప్రతేకా పూజలు జర్పడం జరిగింది. అమ్మవారి కృప తో అందరు బాగుండాలి సుఖసంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో బాగుండాలి అని కోరారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, పోలీస్ అధికారులకి సహకరిస్తూ యూనియన్ సభ్యులు కలిసికటుగా ఉంటూ మన యూనియన్ ని ముందుకి నడపాలి అని కోరారుయూనియన్ ఏరియాస్ ఐఐఐటి, ఇన్ఫోసిస్, గచ్చిబౌలి, విప్రో రంగారెడ్డి డిస్ట్రిక్ట్.ఈ కార్యక్రమం లో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్, లీగల్ అడ్వైసర్ కే. ఎన్. రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వాకిటి శంకర్, జనరల్ సెక్రటరీ గడ్డం శ్రీనివాస్, కోశాధికారి జంగయ్య,కాంగ్రెస్ సీనియర్ నాయకులు డివిజన్ జనరల్ సెక్రటరీ రవీందర్ గౌడ్, శ్రీశైలం యాదవ్, టీ. బీమేష్, బాలరాజు, గంగాధర్, కృష్ణ, బషీద్, యాదయ్య, రాజు, జనార్దన్ తదితరులు పాలుగోన్నారు.

## కూకట్‌పల్లి నల్ల చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం హైడ్రా అధికారులకు కేపీ ఎమ్మెల్యే కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు




**తెలుగు జ్యోతి న్యూస్,నవంబర్ 30,కూకట్పల్లి ప్రతినిధి ఎస్ఎం కుమార్** ఆదివారం చెరువును పరిశీలించిన ఆయన..చెరువు పరిసర రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, బాధితులకు నష్టపరిహారం తప్పకుండా అందిం చేలా కృషి చేస్తానని వెల్లడించా రు....నల్లచెరువులో ఎస్.టి. పి ప్లాంట్ నిర్మాణం కొరకు ఇప్పటికే నిధులు మంజూరు చేశాం అని పనులు త్వరగా పూర్తి చేయాలని సూచిం చారు. చెరువు పరిరక్షణ కి సంబంధించి 2 ఏళ్లు మాత్రమే హైడ్రా హయాంలో ఉంటుంది అని వార్తలు వస్తున్నాయి అని అనంతరం టేక్ ఓవర్ చేసే వాళ్ళు కూడా పరిరక్షణ చేయాలి అని అన్నారు.కూకట్ పల్లిలో ఉన్నటు వంటి ట్రక్ పార్క్ భూమి ని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేస్తున్నట్లుగా వస్తున్న వార్తలను తాము తీవ్రంగా వ్యతి రేకిస్తున్న ట్లు వెల్లడించిన ఎమ్మెల్యే,ఆ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం 5 ఎకరాలో క్రికెట్ స్టేడియంతో పార్క్ అభివృద్ధి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయ ణ,మందాడి శ్రీనివాసరావు నాయకులు కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు..

## చెరువు మన అందరి బాధ్యత అనే మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి నవంబర్ 30:** మియాపూర్ డివిజన్ పరిధిలోని గుర్నాధం చెరువు పరిసర ప్రాంతాలలో లో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన వ్యర్థాల తొలగింపు కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులతో కలసి పాల్గొని వ్యర్థాల తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గుర్నాధం చెరువు చుట్టూ ఉన్న ముళ్ళకంప ఇతర వ్యర్థాలను కాలనీవాసులు యువత ముందుకు వచ్చి శుభ్రం చేయడం మంచి విషయమని ఆయన తెలిపారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల సంరక్షణ కోసం ఎంతో కృషి చేస్తుందని ఆయన గుర్తు చేశారు అందులో భాగంగా మన చుట్టుపక్కల చెరువులను కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరు తమ సహాయ శక్తుల పనిచేయాలని ఆయన యువతకు కాలనీ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. చెరువులు కనుమరుగు అవడానికి చుట్టుపక్కల ప్రజలు అదీ తమ చెరువు కాదని నిర్లక్ష్యంగా ఉండడానికి ఉండడమే ఒక కారణం అవుతుందని ఆయన తెలిపారు. చెరువులు కుంటలు మన



జీవితంలో ఒక భాగంగా చూసినప్పుడు మాత్రమే చెరువులను రక్షించుకునే పరిస్థితి ఉంటుందని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులు,గుర్నాధం చెరువు పరిసర ప్రాంత కాలనీల వాసులు వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భారీ హామీ పూర్తిగా పుకారుగా మారింది:రాష్ట్ర నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు జ్యోతి న్యూస్,నవంబర్ 30,కూకట్పల్లి ప్రతినిధి (ఎస్ఎంకుమార్)** కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల సమయం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భారీ హామీ పూర్తిగా పుకారుగా మారిందని,ఇప్పటికీ అమలు కాని ఈ వాగ్దానం ద్వారా తెలం గాణ బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కూకట్పల్లి బీజేపీ నాయకులు తీవ్రంగా విమర్శిం చారు.ఈ నేపథ్యంలో బీసీల హక్కుల కోసం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి, హామీలను నిలబెట్టుకోని తీరుకు నిరసనగా ఈరోజు కూకట్ పల్లిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు.బీసీలను అభివృద్ధి పేరుతో వంచిస్తు న్నారని, 42% రిజర్వేషన్ అమలు చేయకపోవడం ప్రభుత్వ వంచనకు నిదర్శనమని రాష్ట్రంలో అసంతృప్తి పెరుగుతుండటంతో ప్రజలు ప్రత్యామ్నా యంగా బీజేపీ వైపు చూస్తున్నారని రాజేశ్వరరావు పేర్కొన్నారు.బీసీల హక్కు ల కోసం బీజేపీ ఎప్పటికీ పోరాటం కొనసా గిస్తుందని, రిజర్వేషన్ల అమలును ప్రభు త్వం తక్షణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులునాయిని సూర్యప్రకాశ్ రావు,అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,మూసా పేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేం ద్ర,సీనియర్లు శంకర్ రెడ్డి,సురేందర్రెడ్డి,ఓ బీసీ నాయకులు వెంకట స్వామి,పద్మ య్య,సుధా,మల్లేష్ గౌడ్,వినోద్ కోడిచెర్ల ,కిశోరె,పిట్లమనోహర్ అలాగే డివిజన్ అధ్యక్షులు,మహిళా నాయకు లు,యువకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కేపీ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలనుతెలుసుకుని పరిష్కరించేందుకు నడుం కట్టిన ప్రజా నాయకుడు: బండి రమేష్

**తెలుగు జ్యోతి న్యూస్,నవంబర్ 30,కూకట్పల్లి ప్రతినిధి ఎస్ఎం కుమార్** నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్ లోని గాయత్రి నగర్ లో స్థానిక ప్రజలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తల తో కలిసి అభివృద్ధి పనులు పరిశీలించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్య క్షులు కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్.స్థానిక ప్రజలతో కలిసి అక్కడి పరిస్థి తులను అలాగే జరగాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై స్థానికు లను అడిగి తెలుసుకుని వారితో కలిసి ఆ ప్రాంతంలో ఈ తెల్లవారుజామున పాదయాత్ర నిర్వహించారు.మూడు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు మంచి మెజారిటీ ఇచ్చి అసెంబ్లీకి పంపిస్తే కూకట్పల్లి ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయకపోవడం మా దురదృష్టమని స్థానిక ప్రజలు బండి రమేష్ తో మొరపెట్టుకున్నారు.చేసిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం ఉట్టిపడుతుందని కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా మాత్రమే పనులు జరిగాయి తప్ప ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏమీ లేవని వారు వాపోయారు.ఈ సందర్భంగా బండి రమేష్ స్థానికులతో మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలు ఎవరు ఎలా పాలించినా ప్రస్తుతం ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రజ ల మేలు కోసం వారి అభివృద్ధి సంక్షేమం కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటుం దని ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అభివృద్ధి పనుల్లో ప్రజలకు మేలు జరిగేలా పెద్దపీట



వేస్తుందని తెలియజేశారు.నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ప్రతీ సమస్య పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ అధ్యక్షులు బి బ్లాక్ తూము ప్రెసిడెంట్ తూము వేణు, జిహెచ్ఎంసి ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ మోయుజుద్దీన్,కాంగ్రె స్ పార్టీ సీనియర్ నాయకులు విట్టల్ రెడ్డి ,జమీర్ భాయ్,మస్తాన్ రెడ్డి,కనక య్య, అబ్దుల్లా,ప్రకాష్ ముదిరాజ్,నర సింహయాదవ్,శివచౌదరి,సాయి తులసి,స్థానిక నాయకులు లక్ష్మణ్, శివ,కృష్ణారావు,రాజశేఖర్ రెడ్డి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ప్రారంభమైన కల్ట్ ఫిట్‌నెస్ జిమ్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి హరీష్ రావు

**తెలుగు జ్యోతి న్యూస్ పటాన్చెరువు నవంబర్ 30** పటాన్‌చేరు నియోజకవర్గం ఆమీన్పూర్ మున్సిపాలిటీ రాఘవేంద్ర కాలనీలో నూతనంగా ప్రారంభమైన కల్ట్ ఫిట్‌నెస్ జిమ్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి హరీష్ రావు , దుబ్బాక ఎమ్మెల్యే కోత్త ప్రభాకర్ రెడ్డి , ఎస్సీ–ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , పటాన్‌చేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి మరియు బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ కాట రాజేష్ గౌడ్ ఇతరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నూతన తరానికి ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనతో, యువత ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ ఆధునిక జిమ్ ఎంతో ఉపయుక్తం అవుతుందని నేతలు పేర్కొన్నారు. పటాన్‌చేరు పరిధిలో ఈ విధమైన హెల్త్ %ఽ% ఫిట్‌నెస్ సదుపాయాలు పెరిగితే, యువత శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా ఎదుగుతారని నాయకులు అభిప్రాయపడ్డారు. శ్రీ కాట రాజేష్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక యువత ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెంచుకోవడం అభినందనీయం అని, భవిష్యత్తులో ఇలాంటి ఆరోగ్యకారక వసతుల పెంపు కోసం తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య భద్రత, క్రీడల ప్రోత్సాహం తమ ప్రాధాన్యతలలో ఒకటని చెప్పారు.కార్యక్రమంలో ఎక్స్ మున్సిపల్ కౌన్సిలర్లు,బి.ఆర్.ఎస్ నాయకులు, జిమ్ నిర్వాహకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం

**తెలుగుజ్యోతి న్యూస్ శేరిలింగంపల్లి నవంబర్ 30:**
రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరరిగింది ఏఐజి హాస్పిటల్ సమీపంలో మేఘ ఏడిఫైస్ అపార్ట్మెంట్ లో నాలుగవ ఫ్లోర్ ఫ్లాట్ నెంబర్ 401లో చెలరేగిన మంటలు ,పూజ దీపం సోఫా మీద పడడం తో అగ్ని ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు .ఈ సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ సంఘటన ఫైర్ సిబ్బంది. స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడంతో అక్కడి నివసిస్తున్న ప్రజలు ఊపిరి పిల్చుకున్నారు.

## త్రేన్పులు బాగా వస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయా..? అయితే ఈ చిట్కాలను పాటించండి..



తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అవకపోతే అప్పుడు ఏర్పడే పరిస్థితిని అజీర్తి అంటారన్న విషయం అందరికీ తెలిసిందే. అజీర్తి సమస్య ఉన్నవారికి త్రేన్పులు కూడా అధికంగానే వస్తుంటాయి. అజీర్తి కారణంగా పొట్టలో గ్యాస్ ఏర్పడుతుంది. ఇది త్రేన్పులకు కారణం అవుతుంది. ఇక త్రేన్పులు వచ్చేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. అజీర్తి సమస్య లేకపోయినా కొందరికి విపరీతమైన గ్యాస్ తయారవుతుంది. అలాంటి వారికి కూడా త్రేన్పులు వస్తాయి. అలాగే కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా కొందరికి పొట్టలో గ్యాస్ తయారై త్రేన్పులు వస్తుంటాయి. అయితే ఇది సాధారణ సమస్యే. ఇందుకు ఇంగ్లిష్ మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే పలు సహజసిద్ధమైన చిట్కాలను పాటించడం వల్ల త్రేన్పుల సమస్య ఇట్టే తగ్గిపోతుంది. పైగా జీర్ణ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది.

పచ్చి అరటి కాయలు, లవంగాలు..

త్రేన్పుల సమస్య అధికంగా ఉన్నవారు పచ్చి అరటి కాయలను తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. పచ్చి అరటికాయను తీసుకుని అందులో పావు వంతు ముక్కను కట్ చేయాలి. దాన్ని పొట్టు తీసి తినాలి. ఇలా పూటకు ఒకసారి తినాల్సి ఉంటుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. త్రేన్పులు తగ్గిపోతాయి. గ్యాస్ సమస్య నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. అలాగే త్రేన్పుల సమస్యను తగ్గించేందుకు లవంగాలు కూడా బాగానే పనిచేస్తాయి. భోజనం చేసిన తరువాత ఒక లవంగాన్ని నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. దీని వల్ల సమస్య తొలగిపోతుంది. అదేవిధంగా రోజుకు 2 సార్లు ఒక గ్లాస్ చొప్పున కొబ్బరినీళ్లను తాగుతున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది. ఇక త్రేన్పుల సమస్య ఉన్నవారు ఒక టీస్పూన్ వాము, అంతే మోతాదులో మిరియాలను తీసుకుని కలిపి దంచాలి. ఆ మిశ్రమంలో కొద్దిగా తేనె కలిపి రోజుకు 2 సార్లు తీసుకోవాలి. ఇలా చేస్తున్నా కూడా త్రేన్పులు తగ్గుతాయి.

అల్లం, పుదీనా ఆకులు..

త్రేన్పులు ఉన్నవారు పలు ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఈ సమస్యకు అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసం సేవించాలి. ఇలా రోజుకు 3 పూటలా తీసుకోవాలి. అలాగే భోజనం చేసిన అనంతరం గుప్పెడు సోంపు గింజలను నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. అదేవిధంగా పుదీనా ఆకులను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పుదీనా ఆకుల రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక గ్లాస్ మజ్జిగలో కలిపి సేవిస్తుండాలి. అదేవిధంగా కమోమిల్ టీ కూడా ఈ సమస్యకు బాగానే పనిచేస్తుంది. కమోమిల్ టీని రోజుకు 2 సార్లు తాగుతుంటే త్రేన్పుల సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ టీలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు త్రేన్పులను తగ్గిస్తాయి.

పెరుగు, మజ్జిగ..

త్రేన్పుల సమస్య ఉన్నవారు తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలు, నూనె పదార్థాలు, జంక్ ఫుడ్స్‌ను తినకూడదు. పెరుగు, మజ్జిగను ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి ప్రో బయోటిక్ ఆహారాలు కనుక వీటిని తీసుకుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గించి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే త్రేన్పుల సమస్య ఉన్నవారు ఆహారాన్ని నెమ్మదిగా తినాలి. బాగా నమిలి మింగాలి. త్వరగా తింటే సమస్య తగ్గదు. ఆహారం తినేటప్పుడు ఫోన్ లేదా టీవీ చూడడం, పేపర్ చదవడం, మాట్లాడడం వంటి పనులు చేయకూడదు. బయట ఏవైనా పానీయాలను తాగితే స్ట్రాను ఉపయోగించకూడదు. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఇలా త్రేన్పులు ఉన్నవారు ఆయా చిట్కాలను పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకుంటుంటే ఈ సమస్యను సులభంగా తగ్గించుకోవచ్చు. అలాగే జీర్ణ వ్యవస్థ సైతం ఆరోగ్యంగా ఉంటుంది.

## పూజారిపేటలో దుర్గ భవాని మహా పడిపూజా కార్యక్రమం



**తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం:**
ఆమదాలవలస పూజారిపేటలో శనివారం రాత్రి దుర్గ భవాని మహా పడిపూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం కి భవానిలు మరియు స్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.గురు భవానిలు కృష్ణారావు మరియు బాల భవాని మరియు వేద పండితులు కిషోర్ ఆధ్వర్యంలో ఈ మహా పడిపూజా జరిగింది. ఈ కార్యక్రమంకి పెద్ద సంఖ్య లో భక్తులు పాల్గొని అమ్మవారిని ప్రాదించారు. ఈ కార్యక్రమం కి మార్గదర్శులుగా శ్రీను, హరీష్, లక్ష్మణరావు, దుర్గ ప్రసాద్, హేమంత్, వాసు, యస్వంత్, మన్మధరావు, రవి, మోహన్ రావు, రమణ, కూన నాగు భవాని మత పూజలు చేసారు.

# నవీన్ యాదవ్ కి ఆత్మీయ సన్మాన సభ

### పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్




**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి నవంబర్ 30:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన వల్లాల నవీన్ యాదవ్ కి అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్రం రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు మంత్రి పదవుల్లో స్థానం కల్పించాలని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి మంత్రి పదవి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు బీసీలు నిలబడి అత్యధిక స్థానాలు గెలుచుకొని బీసీల రాజాధికారం అంతిమ లక్ష్యంగా ముందుకు నడవాలని ముఖ్యంగా యువత రాజకీయాల్లోకి రావాలని తద్వారానే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ని ఆదర్శంగా తీసుకొని యాదవ నాయకులు యువకులు యాదవ సంఘాల నాయకులు ఐక్యమై అత్యధిక సంఖ్యలో యాదవులను గెలిపించుకొని బీసీల రాజాధికారం చేజిక్కించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కాలానుగుణంగా కనుమరుగైపోతున్న యాదవ హక్కులను యాదవ నాయకులు బిడ్డలు పోరాడి యాదవ హక్కులను సాధించుకోవాలని అది మన బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ మెంబర్ మందాడి అనిల్ కుమార్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, రాజయ్య యాదవ్, శేర్లింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మేకల రాములు యాదవ్, ఎంబి కృష్ణ యాదవ్, జాతీయజాతీయ ఆర్ లక్ష్మణ్ యాదవ్, ఈశ్వరమ్మ, జగ్గు యాదవ్, యశ్వంత్ యాదవ్, భూమన్న యాదవ్, మహేందర్ యాదవ్, రాష్ట్ర బీసీ నాయకులు వినోద్ యాదవ్ అందెల కుమార్ యాదవ్, వికారాబాద్ జిల్లా బిసి అధ్యక్షులు శంకర్ యాదవ్, వికారాబాద్ జిల్లా బిసి అధ్యక్షులుయాదగిరి యాదవ్, శివకుమార్ యాదవ్, పాములేటి సుబ్బయ్య యాదవ్, మధు యాదవ్, వెంకట్ యాదవ్, కృష్ణ యాదవ్, శేరిలింగంపల్లి యాదవ సంఘం అధ్యక్షులు కిట్టు యాదవ్, సిద్దిక్ నగర్ యాదవ్ సంఘం అధ్యక్షులు అప్పల వినోద్ యాదవ్, మల్లెల ఐలేష్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యాదవ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజా...

**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి నవంబర్ 30:**
సి.హెచ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మనోహరశర్మ పాలెం గురుస్వామి వారి పర్యవేక్షణలో అయ్యప్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమం ను ఓంకార్ భజన బృందం చే స్వామీ వారి భక్తి పాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఆర్.టి.వో ఆఫీసు ఎదురుగా ఉన్నా రాజా రాజేశ్వరి కాలనీ హైటెన్షన్ రోడ్ లోనీ టాటా మోటార్స్ వద్ద ప్రత్యేకంగా వేసిన అలంకరణ పందిరిలో 18 మెట్ల పై స్వామి వారినీ పుష్పాలతో శోభాయనంగా అలంకరించి అంగరంగ వైభవంగా పడి పూజా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమం కి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికేపూడి





గాంధీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి కుమారుడు వీరబ్రహ్మానందరెడ్డి, కుటుంబ సభ్యులు సి.హెచ్ బి ఎన్ రెడ్డి, సి. హెచ్ బాల్ రెడ్డి స్వాముల తో పాటు బాలరాజు గురు స్వామి, మరియప్ప గురు స్వామి, మహేష్ యాదవ్ గురు స్వామి, మహేందర్ రెడ్డి గురు స్వామి, శ్రీకాంత్ గురు స్వామి, వేణు గురుస్వామి, ఓబుల్ రెడ్డి గురు స్వామి, భాస్కర్ రెడ్డి గురు స్వామి, బిజెపి కాంటెస్టేడ్ ఎమ్మెల్యే ఎం. రవి కుమార్ యాదవ్ మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్ , సీనియర్ నాయకులు చాంద్ పాషా, శ్రీ రామ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎ బ్లాక్ ప్రెసిడెంట్ శివకుమార్, రిక రమేష్, తిరుపతి, కృష్ణ, ప్రసాద రావు, నరసింహారెడ్డి, కృష్ణ మూర్తి, వెంకటరమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేస్తున్నారా..? అయితే ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో తెలుసా..?

ప్రస్తుతం ఉరుకుల పరుగుల బిజీ యుగంగా మారింది. అందరూ అన్నింట్లోనూ వేగాన్ని కోరుకుంటున్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్ని రంగాల్లోనూ వేగంగా మార్పులు వస్తున్నాయి. ప్రజలు కూడా వేగంగా పనులు జరగాలని ఆశిస్తున్నారు. ఇక ఆహారం విషయంలోనూ ప్రజలు ఇదే సూత్రాన్ని పాటిస్తున్నారు. చాలా వేగంగా భోజనం చేస్తున్నారు. ఆహారం విషయంలో చాలా హడావిడి కనబరుస్తున్నారు. ఆహారంపై అసలు శ్రద్ధ పెట్టడం లేదు. ఏం తింటున్నారు, ఎంత తింటున్నారు అనే విషయంపై స్పష్టత ఉండడం లేదు. ఆహారపు అలవాట్లు కూడా పూర్తిగా మారిపోయాయి. జంక్ ఫుడ్ తినడం ఎక్కువైంది. ఇళ్లలో వండుకోవడం లేదు. ఎక్కువగా బయటి ఆహారాలను తినేందుకే ఆసక్తిని చూపిస్తున్నారు. ఇక రాత్రి పూట కూడా ఆలస్యంగా భోజనం చేస్తున్నారు. దీంతో అనేక రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి దినచర్య మనకు అనేక అనర్థాలను కలగజేస్తోంది.

మెదడు పనితీరుకు..

రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేయడం వల్ల అనేక తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం చాలా మంది ఈ విధమైన జీవనశైలినే కలిగి ఉంటున్నారు. అయితే ఇలా పాటించడం వల్ల అనేక సమస్యల బారిన పడాల్సి వస్తుంది. ఈ విధంగా ఆహారపు అలవాట్ల వల్ల మెదడుపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల సర్కేడియన్ వ్యవస్థ దెబ్బ తింటుందని అంటున్నారు. దీంతో మెదడు పనితీరు మందగిస్తుంది. నేర్చుకునే శక్తి తగ్గిపోతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. మతిమరుపు వస్తుంది. వృద్ధాప్యంలో అల్జీమర్స్ బారిన పడతారు. ఇక రాత్రి పూట ఆలస్యంగా తినడం వల్ల శరీరంలో క్యాలరీలు అధికంగా చేరుతాయి. దీంతో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. ఫలితంగా బరువు పెరుగుతారు. ముఖ్యంగా పొట్ట, పిరుదులు, నడుము వద్ద విపరీతంగా కొవ్వు చేరుతుంది. దీంతో ఆ కొవ్వును కరిగించడం చాలా కష్టంగా మారుతుంది.



జీర్ణ వ్యవస్థకు..

రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేస్తే కొన్ని రోజులకు కొంత మందికి నైట్ ఈటింగ్ సిండ్రోమ్ అనే వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల రాత్రి పూట ఆహారం తిన్నా కూడా కాసేపటికి మళ్లీ ఆకలి అవుతుంది. దీంతో అధికంగా ఆహారం తింటారు. ఇది మరిన్ని సమస్యలకు దారి తీస్తుంది. దీని వల్ల విపరీతంగా బరువు పెరుగుతారు. రాత్రి పూట ఆలస్యంగా తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. దీంతో ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. ఫలితంగా అజీర్తి ఏర్పడుతుంది. అలాగే గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. దీనికి తోడు మలబద్దకం కూడా ఏర్పడుతుంది. మరుసటి రోజు విరేచనం సరిగ్గా అవదు. దీంతో దీర్ఘకాలంలో పైల్స్ సమస్య వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాగే రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేసే అలవాటు ఉండడం వల్ల శరీరంలో రక్త సరఫరా మందగిస్తుంది. దీంతో బీపీ పెరుగుతుంది. ఫలితంగా గుండె జబ్బులు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి.

ఏ సమయంలోగా తినాలి..?

ఈ రకమైన జీవనశైలిని కలిగి ఉండడం వల్ల టైప్ 2 డయాబెటిస్ బారిన పడే అవకాశాలు కూడా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే రాత్రి పూట ఆహారం జీర్ణం అయ్యేందుకు చాలా సమయం పడుతుంది కనుక నిద్రకు ఆటంకం ఏర్పడుతుంది. దీని వల్ల నిద్రలేమి సమస్య వస్తుంది. తరచూ ఇలా జరుగుతుంటే స్ట్రోక్స్ వచ్చే ముప్పు కూడా పెరుగుతుంది. కనుక రాత్రి పూట వీలైనంత త్వరగా భోజనం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి పూట 7.30 గంటల లోపు భోజనం చేస్తే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. ఇక రాత్రి పూట తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. కారం, మసాలాలు, నూనెలు అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. ఈ విధమైన జీవనశైలిని పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు. రోగాల బారిన పడకుండా ఎక్కువ కాలం పాటు ఆరోగ్యంగా జీవిస్తారు.

Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223